సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి



49వ వార్డు మెయిన్‌రోడ్డులో తాటిముంజలు కొడుతున్న వ్యాపారి



మురళీనగర్ మెయిన్‌రోడ్డులో తాటిముంజలు విక్రయిస్తున్న మహిళ





ఆహా.. భలే మజా

తాటిముంజలు వేసవి తాపానికి ఉపశమనం

మద్దిపాలెం: వేసవిలో తాటిముంజలు తింటే శరీరానికి చల్లదనంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేకూరుతుంది. తాటిముంజల్లో విటమిన్లు, ఖనిజాలు, పోషకాలు సమృద్ధిగా ఉంటాయని అందరికీ తెలిసినదే. జీవీఎంసీ 49,50,51 వార్డుల్లో తాటిముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎండ వేడికి తట్టుకోలేక పనుల మీద తిరిగే వారు తాటిముంజలు కొనుక్కుని వెళ్తున్నారు. కల్తీ లేకుండా, మందులు వాడకుండా తాటికాయల నుంచి తీసిన ముంజలు అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి అని పలువురు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉండే తాటి ముంజలు ఇప్పుడు అన్ని చోట్ల లభ్యవుతున్నాయి. పొలాల గట్ల మీద, ఖాళీ ప్రదేశాల్లో పెరిగే తాటి చెట్లు చిరు వ్యాపారులకు ఉపాధి కల్పిస్తున్నాయి. మాధవధార ప్రధాన రహదారి పొడవునా చాలా చోట్ల తాటిముంజలు విక్రయిస్తున్నారు. వేసవిలో వీటికి డిమాండ్ ఉండడంతో వెంటనే అమ్ముడు పోతున్నాయి. డజన్ రూ.50 నుంచి రూ. 60 వరకు విక్రయిస్తున్నారు.

చుట్టుపక్కల ప్రాంతాల నుంచి..

ఎస్.కోట, కొత్తవలస, పెందుర్తి, అలమండ, ఆనందపురం వంటి ప్రాంతాల నుంచి విక్రయదారులు తీసుకొచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. వేసవిలో రెండు నెలలు మాత్రం ముంజల వ్యాపారం ఉంటుందని వారు చెబుతున్నారు. తర్వాత ఏడాదంతా కొందరు వ్యవసాయం, మరి కొందరు ఏవేవో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తామని చెబుతున్నారు. ఆయా ప్రాంతాల నుంచి ముంజలను ఆటోల్లో తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తామంటున్నారు. ఈ రెండు నెలల పాటు రోజుకు కనీసం రూ.3 వేల వరకు ఆదాయం ఉంటుందని, ఆటో చార్జీలు, కొనుగోళ్లు పోగా రోజుకు కనీసం రూ.వెయ్యి దాటి లాభం ఉంటుందంటున్నారు తాటిముంజుల వ్యాపారులు. ఇందులో కొందరు రైతులు సొంతంగా ముంజలు తెచ్చుకుని విక్రయిస్తే మరి కొందరు రైతుల వద్ద కొనుగోలు చేసి విక్రయిస్తారు. ఏది ఏమైనా ముంజలు తిన్నవారికి, అమ్మిన వారికి మంచి లాభాలు వస్తున్నాయి.

సమృద్ధిగా పోషకాలు..

ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన తాటిముంజల్లో ఎన్నో ఆరోగ్యవరమైన పోషకాలు ఉన్నాయి. నీటి మోతాదు ఎక్కువ కలిగి ఉండడం వల్ల ఎండల్లో వేడి నుంచి తక్షణ ఉపశమనం దొరుకుతుంది. వీటిని తినడం వల్ల వడదెబ్బ తగలకుండా శరీరాన్ని కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించి డీ హైడ్రేషన్ రాకుండా మేలు చేస్తాయి. విటమిన్ బి-7, పొటాషియం, కాల్షియం, జింక్, ఐరన్ వంటి పోషకాలు కలిగి ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. పొటాషియం సమృద్ధిగా ఉండడం వల్ల రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ముఖ్యంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్ కణాల పెరుగుదలను తగ్గించే గుణం కలిగి ఉంటాయి.

మిగతా రోజుల్లో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తాను..



మాది ఎస్. కోట. వేసవిలో తాటిముంజలు తీసుకొచ్చి మాధవధారలో విక్రయిస్తాను. మిగతా ఏడాదంతా ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తాను. ముంజలు అమ్మడం ద్వారా రోజుకు కనీసం రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు వస్తుంది. ఖర్చులు పోనూ బాగానే మిగులుతుంది. జీవనం హాయిగానే సాగిపోతోంది.

– చిన్నా, చిరువ్యాపారి, కొత్తవలస

రెండు నెలల పాటు ఇదే వ్యాపారం..



వేసవిలో తాటిముంజల వ్యాపారం చేస్తాం. రెండు నెలల పాటు ముంజల విక్రయాలు బాగా సాగుతాయి. రోజూ ఉదయం ఆటోలో ముంజలు తీసుకొచ్చి సాయంత్రం వరకు వాటిని విక్రయిస్తాం. లాభాలు బాగానే వస్తాయి. రోజుకు కనీసం రూ.వెయ్యి లాభం వస్తుంది. మిగతా ఏడాదంతా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం.

– సత్యం, చిరు వ్యాపారి, మల్లివీడు, కొత్తవలస దగ్గర

ప్లాస్టిక్ నిషేధంపై అధికారుల తనిఖీలు



సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జీవీఎంసీ అధికారులు

తాటిచెట్లపాలెం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ అధికారులు బుధవారం జోన్-3 పరిధిలో వలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చైతన్యనగర్, సీతమ్మధార రైతుబజార్ ప్రాంతాల్లో పర్యటించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న పలువురు వ్యాపారులకు అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఎస్ఎస్ సత్యనారాయణ, శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, సహాయకుడు సతీష తదితరులు పాల్గొన్నారు.

మహా అన్న సమారాధన



అన్నదానం చేస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

కంచరపాలెం: వివేకానందవీధిలోని పాత్రపిల్లి అచ్చిబాబు కమ్యూనిటీ హాల్లో గొల్లకంచరపాలెం గ్రామదేవత దుర్గాదేవి జాతరలో భాగంగా మహా అన్న సమారాధన నిర్వహించారు. వివేకానంద గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గ్రామాధ్యక్షుడు పల్లా అప్పారావు ప్రారంభించారు. సుమారు 3 వేల మందికి అన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నమ్మి నాని యాదవ్, నమ్మి నాగేంద్ర, నంబారి వీరినాయుడు, పాత్రపిల్లి వెంకటరావు, నమ్మి శంకర్, బొట్టా శ్రీను, పల్లా వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఈవీ ప్రసాదరెడ్డికి నివాళి



ప్రసాద్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు

కంచరపాలెం: రెడ్డికంచరపాలెంలో ఇటీవల స్వర్గస్తులైన ఊర్వశి థియేటర్ అధినేత డీఈవీ ప్రసాద్‌రెడ్డికి రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు బుధవారం నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులు, సన్నిహితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవిరాజు, పురుషోత్తమ్‌రెడ్డి, జి.వి.రెడ్డి, శంకర్ రెడ్డి, డి.రామకృష్ణారెడ్డి, గంగ మహేష్, కుమార్ రెడ్డి, విమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు పెన్షనర్ల హర్షం



మాట్లాడుతున్న చౌదరి అప్పారావు


మద్దిపాలెం: పోర్టు, డీఎల్‌బీ పెన్షనర్లకు 2022-25 వరకు గల ఏరియర్స్‌ను చెల్లించినందుకు పోర్టు పెన్షనర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం 51వ వార్డు కళింగనగర్‌లో విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు ఈసందర్భంగా చౌదరి అప్పారావు మాట్లాడుతూ ముందుగా బకాయిలు చెల్లించినందుకు పోర్టు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షనర్లకు సరైన వైద్యం అందడం లేదని, నాసిరకమైన మందులు ఇస్తున్నారని అన్నారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేట్‌పరం చేస్తున్నారని, తక్షణమే ఆ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పులి శివప్రకాష్‌రావు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగ అరెస్ట్

• పరారీలో మరొకరు

మద్దిపాలెం: ఆటోలో కూర్చుని ఉన్న ఓ వ్యక్తిని కొట్టి అతని వద్ద నుంచి నగదు లాక్కున్న ఘటన కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో కంచరపాలెంలోని ఒక బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఆటోలో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి కూర్చుని ఉండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి సదరు బాధితుడిని కొట్టి చేతులు పట్టుకుని అతని ఫ్యాంట్ జేబులో ఉన్న రూ.1700 నగదు లాక్కున్నారు. అనంతరం అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కోవడానికి ప్రయత్నించారు. అతడు ఫోన్‌ను గట్టిగా పట్టుకోవడంతో వారిద్దరూ అక్కడి నుండి నగదు తీసుకుని పారిపోయారు. సదరు బాధితుడు మరుసటి రోజు అంటే ఈ నెల 7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్రైం సీఐ ఎన్. శ్రీనివాసరావు నేతృత్వంలో స్పెషల్ టీంను ఏర్పాటు చేసి వారిని గాలించగా ఇటీవల ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న దమరసింగి మోహన్ కన్నా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడే దోపిడీకి పాల్పడినట్టు గుర్తించారు. అతడి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. కాగా సదరు నిందితుడు మోహన్‌కన్నాపై గతంలో కంచరపాలెం స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్టు తెలిపారు. ఇతడిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు పేర్కొన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న దత్తి అప్పలనాయుడు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమకారుడు దత్తి అప్పలనాయుడు బుధవారం పాల్గొని పుస్తక పఠనం పట్ల అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు దోహదపడతాయన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను అవసరానికి మించి వాడకూడని చెప్పారు. తెలుగు పద్య పఠనంలో ఉన్న గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. పద్య పఠనంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

దేశవ్యాప్త సమ్మెలో భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

మద్దిపాలెం: దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు భాగస్వామ్యం కావాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జోన్ నాయకుడు శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఉదయం 51వ వార్డు 48ఎ బస్‌స్టాప్ వద్ద సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. ఆప్కోస్ రద్దు చేయకుండా దానిలో లోపాలను సరి చేయాలని, స్థానిక సమస్యలపై ఇన్‌కం ట్యాక్స్ బకాయిలు, బకాయి హెల్త్ అలవేన్స్‌లను జీవీఎంసీ జనరల్ ఫండ్ నుంచి చెల్లించాలని, పబ్లిక్ హెల్త్ కార్మికుల మాదిరిగానే మిగిలిన కార్మికులకు జీవో 25 ప్రకారం మరణించిన కార్మిక కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా రూ. 2 నుంచి రూ. 7 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్కర్ కం డ్రైవర్లకు జీవో 36 ప్రకారం రూ.24,500 చెల్లించాలని అన్నారు. అలాగే పలు సమస్యల విషయమై ఈ నెల 20న సమ్మె చేస్తున్నామని తెలిపారు. పారిశుద్ధ్యం, వెటర్నరీ, వాటర్ సప్లై, ఇంజినీరింగ్, యూజీడీ, క్లాప్ ఆటో తదితర విభాగాల కార్మికులంతా కలిసి సమ్మె చేస్తున్నామని శ్రావణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులు దేవి, లక్ష్మి, కుమారి, పోలయ్య, భద్ర. దాలయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యమాంబ పండగకు శ్రీకారం



అమ్మవారి వేడుకల కరపత్రం ఆవిష్కరిస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

సీతంపేట: అక్కయ్యపాలెం గ్రామ దేవత శ్రీ ముత్యమాంబ అమ్మవారి పండగ జూన్ 17న ఘనంగా నిర్వహించేందుకు గౌరీ సేవా సంఘం నిర్ణయించింది. దీనికి సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆలయ ముఖద్వారం వద్ద గౌరీ సేవా సంఘానికి చెందిన రాజగిరి అప్పలరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 3వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ముత్యమాంబ అమ్మవారి పండగ వైభవంగా జరిపిస్తామని తెలిపారు. జూన్ 3వ తేదీన తొలివారం భూలోకమాత ఉత్సవం, జూన్ 10న రెండవ వారం కుంచుమాంబ ఉత్సవం, జూన్ 16న పుట్ట బంగారమ్మ వేడుకలు, తొలేళ్ల సంబరం, జూన్ 17న ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండగ జరుగుతుందని తెలిపారు. జూన్ 24న అమ్మవారి మారువారం, మహా అన్నదానం జరుగుతాయని తెలిపారు. పురప్రజలు, భక్తులు పాల్గొని అమ్మవారి పండగను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి ఈశ్వర అప్పారావు, చైర్మన్ మళ్ల త్రినాథరావు, వైస్ చైర్మన్ ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పిళ్లా గోపి, కన్వీనర్ పిళ్లా పకీర్ నాయుడు, ఉపాధ్యక్షులు మల్ల శివ, బొడ్డేటి కన్నారావు, మాదేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విమర్శ ఒక సాహిత్య ప్రక్రియ



ప్రసంగిస్తున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో ఆధునిక తెలుగు సాహిత్య విమర్శపై ఆచార్య వెలమల సిమ్మన్న ప్రసంగించారు. విమర్శ ఒక సాహిత్య ప్రక్రియ అని, ఈ ప్రక్రియ ఇతర ప్రక్రియల్లాంటిది కాదని, దీనికి ప్రత్యేకత ఉందన్నారు. సాహిత్యం ఎలా ఉండాలో విమర్శ అని, వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో సాంప్రదాయ విమర్శ, ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంత విమర్శ, సాంఘిక విమర్శ, భావ కవిత్వ విమర్శ, హేతువాద విమర్శ, అభ్యుదయ కవిత్వ విమర్శ, దిగంబర విమర్శ, మార్క్సిస్టు విమర్శ, స్త్రీవాద సాహిత్య విమర్శ ఇలా ఎన్నో విమర్శ రీతులు ఉన్నాయని వివరించారు. సమర్థవంతంగా విమర్శ చేసే వారిలో కందుకూరి, కట్టమంచి, రాళ్లపల్లి, వేటూరి, ఆర్.ఎస్.సుదర్శనం, కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, అక్కిరాజు ఉమాకాంతం, కొడవటి కుటుంబరావు, త్రిపురనేని మధుసూదనరావు, రారా, రమణారెడ్డి, శ్రీశ్రీ, చేకూరి రామారావు చెప్పుకోదగిన వారన్నారు. జ్ఞానం కావాలన్న వాడికి, రచన ప్రకాశించడానికి, పాఠకుల ఆలోచనలకు మార్గం చూపేది సాహిత్య విమర్శ అని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ తెలుగులో సాహిత్య విమర్శ ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వచ్చిందన్నారు. కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు కవిత్వ తత్త్వ విచారం తెలుగులో విమర్శకు తొలి గ్రంథమని పేర్కొన్నారు.

ఏవీఎన్‌లో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభం

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో 3వ ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ వార్షిక (యాన్యువల్ ట్రెనింగ్ క్యాంపు) శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రి నాయుడు సహాయ సహకారాలతో ఈ క్యాంపు ఈ నెల 22 వరకు నిర్వహించనున్నారు. 10 రోజుల కాల వ్యవధిలో క్యాడెట్లకు క్రమశిక్షణ, నాయకత్వం, సేవా విలువలు పెంపొందించేందుకు శిక్షణ తోడ్పడుతుంది. మూడేళ్ల ఎన్‌సీసీ ట్రైనింగ్‌లో శారీరక శిక్షణ, సీమెన్‌షిప్, వాటర్ మెన్ షిప్, డ్రిల్, ఫైరింగ్, సివిల్ డిఫెన్స్‌లో తర్ఫేదు పొందనున్నారు. అంతే కాక నేవల్ సర్వీస్ సబ్జెక్టులు, అత్యవసర వైద్య సేవలు, సైబర్ సెక్యూరిటీపై అవగాహన, సామాజిక సంక్షేమ కార్యకలాపాలపై గ్రౌండ్ క్లాసులు నిర్వహించనున్నారు. ఐక్యత.. క్రమశిక్షణకు అనుగుణంగా క్యాడెట్ల శారీరక ఓర్పు, మానసిక స్థితి, పౌర బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ సెషన్స్ ఎన్‌సీసీ ప్రధాన నినాదంతో సాగుతాయని 3వ ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ సబ్ లెఫ్టినెంట అరవింద్ తెలిపారు.

సీసీ కెమెరాలు దొంగిలించిన యువకుడి అరెస్ట్



ఉదయ్‌కుమార్

మద్దిపాలెం: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తిరిగి వాటినే చోరీ చేస్తూ పోలీసులకు ఓ యువకుడు పట్టుబడ్డ ఘటన కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.. కంచరపాలెం రామారావు ఆస్పత్రి సమీపంలో నివాసముంటున్న ఉదయ్‌కుమార్ ఇళ్లు, అపార్టుమెంట్లలో వినియోగదారుల కోరిక మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుంటాడు. ఈ క్రమంలో మద్దిపాలెం, బిర్లా జంక్షన్ వద్ద ఇటీవల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలు, మోనిటర్, డీవీడీ తదితర సామగ్రి చోరీ జరిగిందని సంబంధిత ఇంటి యజమానులు క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ ఎన్. శ్రీనివాసరావు నేతృత్వంలో బృందం దర్యాప్తు చేయగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వ్యక్తే చోరీకి పాల్పడినట్టు గర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని సీసీ కెమెరాలు, వాటికి సంబంధించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు.



దొంగతనానికి గురైన సామగ్రి

సార్వత్రిక సమ్మె విజయవంతం కోరుతూ 16న బైక్ ర్యాలీ

డాబాగార్డెన్స్: అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన మే 20వ తేదీ అఖిల భారత సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ ఈ నెల 16న బైక్ ర్యాలీ చేపట్టనున్నట్టు సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. మన్మథరావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ తలపెట్టిన సమ్మెను కార్మికవర్గం జయప్రదం చేయాలని కోరారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

ఎర్నిమాంబ వార్షిక జాతరకు ఏర్పాట్లు



అమ్మవారి జాతర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో సురేష్‌బాబు తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతరకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో డి.వి.ఎస్. సురేష్‌బాబా తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలు ఈ నెల 14 నుండి 18 వరకు శోభాయమానంగా జరుగుతాయని, పందిరిరాటతో అమ్మవారి వార్షిక జాతర ఉత్సవాలు మొదలైనట్లు తెలిపారు. 15వ తేదీ ఉదయం 9 గంటలకు అచ్చియ్యమ్మపేట, జ్ఞానాపురం గ్రామాల ప్రజలచే అమ్మవారికి నీలధార సమర్పణ కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం 5 గంటల నుంచి హరికథా కాలక్షేపం ఉంటుందన్నారు. 16వ తేదీ అమ్మవారికి మూలమంత్ర హవనములు, సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. 17వ తేదీ తొలేళ్ల ఉత్సవంలో అమ్మవారి ప్రతిమలను పూర్ణామార్కెట్ సమీపంలోని దుర్గాలమ్మ గుడి నుండి కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, కాన్వెంట్ కూడలి మీదుగా జ్ఞానాపురంలో గల అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొస్తామని చెప్పారు. 18న జరిగే ప్రధాన జాతరలో ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, విశేష కుంకుమార్చన, వివిధ పుష్ప జాతులతో అలంకరణ, ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారి జాతర ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే వడదెబ్బ నుంచి రక్షణ



మాట్లాడుతున్న జాయింట్ లేబర్ కమిషనర్ రామారావు

సీతంపేట: తీవ్రమైన ఎండల కారణంగా కార్మికులు వడదెబ్బకు గురి కాకుండా పరిశ్రమల యాజమాన్యాలు రక్షణ చర్యలు చేపట్టాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు తెలిపారు. అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయంలో బుధవారం పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక కమిషనర్ జారీ చేసిన సూచనల మేరకు కార్మికులు వడదెబ్బ బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో భాగంగా కార్మికులకు ఎండ, వడగాల్పుల నుంచి రక్షణకు పాద రక్షలు, టోపీలు అందజేయాలని సూచించారు. అలాగే సీఎస్ఆర్ ఫండ్ కింద ఫ్యాక్టరీ గేటు ముందు ఉచిత మజ్జిగ, తాగునీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పరిశ్రమల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో విజయ విశాఖ మిల్క్ ప్రొడ్యూసర్స్, లారస్ ల్యాబరేటరీస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐఐటీలో ఇంజినీరింగ్ చదువుతా...


సీబీఎస్ఈ ఫలితాల్లో అక్షయప్రియ సత్తా



తల్లిదండ్రులతో అక్షయప్రియ

మురళీనగర్: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో మత్స అక్షయప్రియ సత్తా చాటింది. 500 మార్కులకు గాను 488 మార్కులు సాధించింది. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే అక్షయప్రియ ఉత్తమ మార్కులు సాధించడం పట్ల తల్లిదండ్రులు మత్స శ్రీనివాసరావు, దేవి సంతోషం వ్యక్తం చేశారు. ముంబయి ఐఐటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చదవడమే తన ఆశయమని ఆమె తెలిపింది.

ఐటీసీ కంపెనీలో కొలువు సాధించిన గైస్ విద్యార్థిని



ఉషశ్వినికి ఉద్యోగ నియామక పత్రాన్ని అందిస్తున్న డీడీ రామకృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: భద్రాచలంలోని ఐటీసీ కంపెనీలో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్)కు చెందిన కెమికల్ ఇంజినీరింగు ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విద్యార్థిని నాగిరెడ్డి ఉషశ్విని మొట్టమొదటి సారిగా ఉద్యోగం సాధించి రికార్డు సృష్టించింది. ఇంత వరకు ప్లాస్టిక్ పాలిమర్స్ విభాగం విద్యార్థులెవరూ ఈ కంపెనీలో ఉద్యోగాలు సాధించలేకపోయారని గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కంచరపాలెం ఇందిరానగర్-5కు చెందిన ఆమె తండ్రి నాగిరెడ్డి అప్పలనాయుడు రోజువారీ కూలి పనులు చేసుకుంటూ కుమార్తెను చదివిస్తున్నారు. ఆమె తల్లి గృహిణి. తండ్రి పడుతున్న కష్టానికి ప్రతిఫలంగా ఉషశ్విని ఐటీసీలో రూ.4 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. ఇది తమ కాలేజీకి గర్వకారణమని గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ సంతోషం వ్యక్తం చేశారు. ఉషశ్వినికి నియామక పత్రాన్ని టెక్నికల్ ఎడ్యుకేషన్ డీడీ డాక్టర్ ఎంవీ రామకృష్ణ అందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com